# 'పుష్పావతి'

శ్రీమతి మన్యా కామేశ్వరీదేవిగారు

తార్తారు వంశసార్వభౌముఁ డల్లాయుద్దీను చిత్తూరు దుర్గమును ముట్టడించి పెక్కేండ్లు కష్టపడి, యెత్తరాని యవతారములెత్తి, కడకు 1303 వ సంవత్సరమున దానిని దన యధీనముచేసికొనెను. నూఱులు వేలును వీరయోధులు గతించిరి. రాజకుటుంబమంతయు నిహతమయ్యెను. అజయసింహుఁడు నతని యనుజు 'దూరు' సింహుఁడును మిగిలిరి. అజయసింహుడు మేవాడ పాలకుఁడయ్యెను. ఊరసింహుఁ డన్నిగతుల నన్నకుఁ దోడ్పడుచుండెను!

ఒకనాడుదయము కొందఱు మిత్రులువెంటరా నూరసింహుడు మృగయావిహారమునకు వెడలెను! చేరువఁగల "యెం డ్వా" రణ్యముల సంచరించుచు మధ్యాహ్నమగు డొక ఘోరవరాహపోతమును వెంబడించిరి. అదియు వారిని నానావిధములఁ ద్రిప్పి యలయించి- తుదకొక జొన్నచేను బ్రవేశించి యదృశ్యమయ్యెను. ఊరసింహుఁడు నతనిస్నేహితులు దానిని దఱుముకొనుచుపొలమును సమీపించిరి. అప్పటికే మంచెపై నిలచి పిట్టలఁ దోలుచుండిన—

పడుచు:—పూజనీయులారా! మీరందఱిటు లొక్కుమ్మడి ప్రవేశించిన పైరుచెడిపోవునుగదా! మీకేమి కావలయునో తెలుపుఁడు. సమకూర్తును.

ఊరసింహుఁడు:—బాలికామణీ! మేము తఱుముకొనివచ్చిన పంది నీచేన దూరెను. దానిని బట్టుకొన వచ్చియుంటిమి!

పడుచు:—మీకు శ్రమవలదు! సజీవముగనో విగతజీవముగనో దానిని బట్టికొనితెచ్చి మీకప్పగింతును. తొందరపడకుఁడు!

ఊరసింహుఁడు:—తన్వీ! ఆయుధపాణులమైన యిందఱము వీరుల నలయించితెచ్చిన యీవరాహము నిరాయుధవైన నీకు లభించునా? మేము పట్టుకొందుము- మఱియు నీపైరునకు జెరుపుగలుగనీయము!

పడుచు:—అయ్యా! యింతదాక మీప్రయత్నము ఫలించలేదు. నేనును వీరవంశ సంజాతనే? దాని నశ్రమముగఁ బట్టితెచ్చి మీకిత్తును? నాపాలి కీపంది యొక యెలుకపిల్లవంటిది.

అని నవ్వుకొనుచు, నొకదంటుపీకి- చివ్వ పైరునఁ జొరఁబాఱి నాలుగునిమిషములలో నావరాహ కళేబరము నీడ్చుకొనితెచ్చి వారిముందర విడిచెను!

ఊరసింహుఁడు:—తరుణీ! నీధైర్యసాహసములఁ గొనియాడెద. నీతలిదండ్రు లెవ్వరు? నివాసమేది?

పడుచు:—'జగత్పతి'యనియు 'భారతఖండ ప్రచండమార్తాండు', డనియు నపారకీర్తిఁగాంచిన పృథ్వీసార్వభౌముని జననముచే నేవంశము పరమపావనమయ్యెనో అట్టి చౌహాణఁ (చతుర్భుజ) వంశమున నవతరించిన చంద్రసింహుని పుత్రికను! ఈ చేరువగ్రామమున నున్నాము. నన్నుఁ బుష్పావతి యందురు. మీరెవరో తెలియఁగోరెద?

ఊరుసింహుఁడు:—కన్యకామణీ ! రాణా అజయసింహుని యనుజుఁడ. నన్నూరుసింహుఁ డందురు ! నిన్ను దర్శింపఁగలిగితి. నేడు సుదినము ? ఇక సెలవు !

అని యందఱు వెడలిరి. మండువేసవి. మధ్యాహ్నసమయము ! నీరజమిత్రుఁడు నిప్పులుమియుచుండెను ! చేరువఁబారు సెలయేటి దరిఁజేరి గుఱ్ఱముల నచట వృక్షశాఖలఁగట్టి అందఱాహారముఁ గొనఁ గూర్చుచుండిరి.

ఇంతలో ! రివ్వున నొకచిన్నరాతి గుండువచ్చి ఊరుసింహుని యశ్వమునకుఁ దగిలి దానికాలు కుంటువడెను. అందఱును మోములెత్తి చూడసాగిరి. ఇంతలో మంచె దిగివచ్చి

పుష్పావతి:—అయ్యలారా ! కంకులపై వ్రాలకుండఁ బక్షులను దోలుతఱి, రాయి యొడిసెలనుండి తప్పివచ్చి పొరపాటున మీయశ్వమునకుఁ దగిలినది. ఉద్దేశపూర్వకముగాని నా యీ య ప రా ధ ము ను మన్నింపుఁడు.

ఊరు:—పుష్పావతీ ! నీపేరువలెనే నీ హృదయ మత్యంతకోమలము. నీయుదాత్తహృదయమెఱింగిన మేము నిన్నన్యథా భావింపము. నిశ్చింతముగనుండుము !

పుష్పావతి:—రాజా ! మీకరుణామయ హృదయము నెంతయుఁ గొనియాడుదు !

అని సెలవొంది వెళ్లెను. రాజపుత్రులు భోజనములొనరించి కొంతవడి విశ్రమించిరి. ప్రొద్దుమావటి వేళ కందఱశ్వములపై నధిరోహించి రాజధానిదెసకుఁ బయనింపసాగిరి. ఇంతలో మార్గమున — క్షీరఘటము శిరమున నిడికొని, రెండుచేతుల రెండుమేకలను బట్టి నడిపించుకొనుచు నొకకాపు కన్నెవారి కెదురయ్యెను. ఆమె పుష్పావతియని వారు తెలిసికొనిరి. వేడుకకై వారామె పాలకుండను క్రిందికి ద్రోయవలెనని యాలోచించిరి. అంత, వారిలో, హరిసింహుఁడు తనహయము నామెను ద్రోసికొని పోవునట్లు నడిపించెను !

పుష్పావతి కలఁతవడక - కుడిచేతిపగ్గము నొకవిధమునఁ ద్రిప్పి తనమేక హరిసింహునిగుఱ్ఱము ముందఱికాళ్ల నడుమకు నడిపించెను ! అశ్వముబెదరి, తొట్రిలెను. హరిసింహుడు నేలకువ్రాలెను. పుష్పావతి పాలకుండతో నెమ్మదిగానె నిల్లు చేరుకొనెను !

మఱునాడుదయ మూరుసింహుడు గంధర్వము నెక్కి- చంద్రసింహు నింటికివెళ్లెను. అత డితని కెదురువచ్చి కొనిపోయి పడసాల నాసీను గావించెను ! సమానస్వాతంత్ర్యభావమున నతని యెదుర నాసనమునఁ గూర్చుండి

చంద్రసింహుఁడు:—ప్రభూ ! మిమ్మింతదూరము గొనివచ్చిన కార్యమేదియో తెలిసికొనఁగోరెద ?

ఊరు:—అయ్యా ! నిన్న నేనును నామిత్రులును, వేటకైవచ్చి మీపుష్పావతిని దర్శించితిమి. ఆమె ధైర్య సాహసముల స్వయముగా నెఱిఁగితి. ఇపుడామెను వివాహమాడఁగోరి మీయనుమతిఁ బడయవచ్చితి !

చంద్రసింహుఁడు:—ప్రభూ ! మీరాక నాకు బరమహర్షప్రదము. కాని మేము సామాన్యకృషీవలులము! మీరు మహారాజులరు ! వియ్యమునకు, నెయ్యమునకు సమతవలయుగదా ? కావున మీయుపపాదనము నాకు సమ్మతముకాదు ! వేఱొకకన్యను చూచుకొనుఁడు.

ఊరు:—నాకామెపైఁ గోర్కెకలదు. మీరనుమతించిన మీయింటనే వివాహ మతివైభవముతో జరుప నేర్పాటుగావింతును.

చంద్రసింహుఁడు:—అదియే నేను వలదనినది ! ఇఁకసెలవు !

అని లేచెను! కొండంతటి యాసతో నరుదెంచియుండిన యూరుసింహుని యుల్లమున బ్రహ్మాండ మంతటి నిరాశా నిరుత్సాహములు నివ్వటిల్లెను ! ఏమిచేయుటకు దోపక యతఁడు లేచ్చివచ్చి, పుష్పావతీ జాగ్రన్మంగళవిగ్రహమతని హృదయమున స్థిరనివాస మేర్పఱుకొనుట రాజధానికేగక యాగ్రామము సమీప మందలి యుపవనమున నిలిచెను !

ఇచటఁ జంద్రసింహుని యింట నతనితల్లి జరిగిన విషయమెఱింగి కుమారునిబిలిచి యతని యనాలోచిత ప్రవర్తనమునకై కఠినముగ దండించెను. ఊరుసింహుఁ డడిగినంతనే 'పదివేల'ని సమ్మతించి యుండవలసినదని నుందలించెను !

చంద్రసింహునకుఁ దల్లిమాటలే ప్రమాణము. పశ్చాత్తాపతప్తుఁడై సాయంత్రము వాహ్యాళివ్యాజమున నుపవనమున కేగెను. ఊరుసింహునిచూచి మాటాడెను. అతనికి పుష్పావతి నిచ్చునట్లు సమ్మతిఁదెలిపెను.

మహావైభవముతోఁ బెండ్లిజరిగెను. వారి వివాహపుణ్యఫలమే 'మహారాణాహమీరసింహుఁడు'. అజయసింహు నానతిమెయిఁ దన పండ్రెండవసంవత్సరమున మేవాడ్ సింహాసనమెక్కి యఱువదినాలుగేండ్లు ప్రతిహతముగా నవనిఁ బాలించి నిజయశశ్చంద్రికలు నిఖిలదిగ్వీథుల నెరపిన యానిరుపమాన సార్వభౌముని గూర్చి ముందుఁదెలిసికొందురు.

---

## విజ్ఞప్తి

'గృహలక్ష్మి' యందలి రచయితల చిత్రపటములు ప్రచురింపుడని పలువురు కోరుచున్నారు. ఆకోరిక మాకదివరకేగల అభిలాషను ఇనుమడింప చేసినది. కాన స్వహస్తముగు తమ చరిత్రలతోపాటు చిత్రపటములనుగూడ రచయితలు మాకంపగోరెదము.

సంపాదకుడు.

---